క్లుప్తంగా

30 నుంచి గ్రామదేవత ఉత్సవాలు



గ్రామదేవత పండగ చాటింపు వేస్తున్న అమ్మవారి సేవకులు

వీరఘట్టం: వీరఘట్టం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి పండగను ఈ నెల 30 నుంచి మే 10వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ప్రముఖ యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ తెలిపారు. ఈమేరకు ఆదివారం సాయంత్రం గ్రామ పెద్దల సమక్షంలో చాటింపు వేయించారు. సన పో..సనపో అంటూ అమ్మవారి సేవకులు డప్పులు వాయిస్తూ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం గ్రామంలోని అన్ని వీధుల్లో కాగడాలతో పండగను చాటింపు వేశారు. అంతకుముందు బోయిడు (ఆలయ పూజారి) అమ్మవారికి దండకం చదివి పూజలు చేశారు. గ్రామ పెద్దలు, భక్తులు కొబ్బరి కాయలు కొట్టి పూజలు చేశారు.

'కందుకూరి' గొప్ప సంఘ సంస్కర్త



వీరేశలింగం చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న సంజీవనాయుడు

బలిజిపేట: మండలంలోని పెదపెంకి గ్రామంలో నేతాజీ గ్రంథాలయంలో కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్ల సంజీవనాయుడు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన సమ సమాజ స్థాపనకు ఆయన చేసిన కృషిని కొనియాడారు. కందుకూరి వీరేశలింగం గొప్ప సంఘ సంస్కర్త అని, స్త్రీలు, అంటరాని కులలకు చెందిన పిల్లలు చదువుకునేందుకు పోరాటం సాగించారన్నారు. సమాజంలోని ప్రతిఒక్కరూ సమానమేనని, ఎవ్వరినీ తక్కువగా చూడకూడదని ఆయన చెప్పేవారన్నారు. అటువంటి మహనీయుల అడుగుజాడల్లో అందరూ నడవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు దయానంద్, ఎం.శ్రీను, కె.సతీష్, పి.భాస్కరరావు, బి.హర్ష, పి.పరశురామ్, బి.వెంకటరమణ పాల్గొన్నారు.

'సిరిమాను'కు ప్రత్యేక పూజలు



సిరిమాను చెట్టుకు పూజలు చేస్తున్న బర్లి గ్రామస్తులు

బలిజిపేట: గజాలమ్మ తల్లి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని బర్లి గ్రామంలో సిరిమాను చెట్టుకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. మే 8, 9, 10వ తేదీల్లో జరిగే ఉత్సవాల్లో నిర్వహించే సిరిమానోత్సవానికి ఈ సిరిమానును సిద్ధం చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.అప్పలనాయుడు, పూజారి గౌరునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఒక్కపూటే పని చేయించాలి



వేతనదారులకు సూచనలిస్తున్న సీపీఎం మండల కార్యదర్శి ఈశ్వరరావు

సీతానగరం: ఎండల తీవ్రత కారణంగా ఉపాధి హామీ పనుల వేతనదారులతో ఒక్కపూట మాత్రమే పని చేయించాలని సీపీఎం మండల కార్యదర్శి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని ఆర్‌ఓబీ సమీపంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆదివారం పరిశీలించిన ఆయన వేసవి నేపథ్యంలో వడదెబ్బ బారి నపడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వేతనదారులు పనికి వచ్చేటప్పుడు వాటర్‌బాటిల్‌తో నీరు తీసుకురావాలన్నారు. అలాగే పని ప్రదేశంలో టెంట్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు.



వీరఘట్టం: తెట్టంగిలో ప్రచారం చేస్తున్న ఏఎంసీ వైస్ చైర్మన్ లక్ష్మణరావు, తదితరులు



కొమరాడ: విక్రంపురంలో సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న డీసీఎంఎస్ ఉపాధ్యక్షుడు కళింగి మల్లేశ్వరరావు, తదితరులు



జియ్యమ్మవలస: దాసరిపేటలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు

జగనన్నతోనే సుపరిపాలన



సీతంపేట: అక్కన్నగూడలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్న సర్పంచ్ రుతోని, తదితరులు



భామిని: చిన్నదిమిలిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి చిరంజీవులు



పాలకొండ రూరల్: అట్టలిలో ప్రభుత్వ పనితీరుపై ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్న సర్పంచ్ సంధ్యారాణి, పార్టీ నాయకులు



పాలకొండ: ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై పట్టణంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, పార్టీ నాయకులు

సుపరిపాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు మద్దతుగా నిలుస్తున్నారు. 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం పలు గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పనితీరు బాగుందని, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా.. సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా.. మళ్లీ జగనన్నే సీఎం కావాలని కోరుకుంటున్నట్లు చెప్పారు.

– సాక్షి నెట్‌వర్క్ పాలకొండ, కురుపాం

తీరిన 'వే'దన



చిన్నరామకు నిర్మించిన రహదారి

సీతంపేట: చిన్నరామ గ్రామానికి సరైన రహదారి లేక గత కొన్నేళ్లుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామానికి తారురోడ్డు నిర్మించారు. దీంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి చొరవతో గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ శాఖ ద్వారా సుమారు రూ.50 లక్షలతో రోడ్డు నిర్మించారు. త్వరలో ఈ రహదారిని ప్రారంభించనున్నట్లు ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ ఈఈ జి.మురళి తెలిపారు.

సాగు ప్రణాళికతో అధిక దిగుబడులు



వేసవి దుక్కి చేస్తున్న రైతు



భూసార పరీక్షలకు మట్టి నమూనా సేకరిస్తున్న రైతులు

పాలకొండ రూరల్: రైతులు ఖరీఫ్ సాగుకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని వ్యవసాయశాఖాధికారి ఎన్ని వాహిని సూచించారు. ముఖ్యంగా విత్తనాల సేకరణ, వేసవి దుక్కులు, భూసార పరీక్షలు వంటి వాటిపై రైతులు అవగాహన పెంచుకోవడంతో పాటు పక్కా కార్యాచరణతో సాగు చేపడితే మేలైన దిగుబడులు సాధ్యమవుతాయని అంటున్నారు. ఖరీఫ్‌లో సాగు చేసే పంటలకు సంబంధించి విత్తనాల సేకరణ, పచ్చిరొట్ట సాగు, వేసవి దుక్కులు, సాగు యాజమాన్య పద్ధతులపై ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉన్న వీఏఏల సూచనలు సలహాలు తీసుకోవాలని సూచించారు.

వేసవి దుక్కులతో ప్రయోజనాలు

ప్రస్తుత వేసవిలో దుక్కులు చేపట్టడం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నాయి. వేసవిలో దుక్కి చేయడం వల్ల పొలంలో ఉన్న కలుపు మొక్కలు, కీటకాల గుడ్లు, లార్వాలు పైకి చేరి ఎండకు నశిస్తాయి. నేల పొరల్లో గాలిచేరి మట్టి వదులుగా మారుతుంది. వర్షాలు కురిసే సమయంలో నేల లోపలి పొరల్లోకి నీరు ఇంకి ఖరీఫ్ సాగుకు భూమి అనువుగా తయారవుతుంది. పచ్చిరొట్ట పంటలు సాగు చేసి దమ్ములో కలియదున్నడం ద్వారా అందులోని నత్రజని, కర్బన మూలకాలు నేలను చేరి పంటకు ఎరువుగా ఉపయోగ ఉపయోగపడుతుంది. దీని వల్ల రసాయన ఎరువుల వినియోగం, సాగుఖర్చు తగ్గుతుంది.

ప్రణాళిక అవసరం..

రైతులు వేసవిలో తమ పొలంలోని మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు చేయించుకోవాలి. వాటి ఫలితాలకు అనుగుణంగా పంటకు కావాల్సిన ఎరువులు వేసుకోవడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చు. అందుబాటులో ఉన్న నీటివనరులను సద్వినియోగం చేసుకుని అందుకు తగ్గట్టుగా సాగుప్రణాళికలను సిద్ధం చేసుకోవాలి. అప్పుడే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చు. వేసవిలో పంటకాలువల్లో పూడికతీతలు, చిన్నచిన్న మరమ్మతులు చేపట్టడం వలన నీటినిల్వ సామర్థ్యం పెరుతుంది. తర్వాత కాలంలో పంటకు కావాల్సిన నీరు అందుబాటులో ఉంటుంది.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే ముస్లింల అభివృద్ధి

● ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే శంబంగి



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే శంబంగి, తదితరులు

బొబ్బిలి: రాష్ట్రంలో ముస్లిం, మైనార్టీ వర్గాలను ఆదుకునేది వైఎస్సార్‌సీపీయేనని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. పట్టణానికి చెందిన ముస్లిం మత పెద్దలు ఆదివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరావు, జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జ్ రేజేటి ఈశ్వరరావు(విసు), ముస్లిం మైనార్టీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హమీద్, జామియా మసీదు అధ్యక్షుడు హాజీ పీరా, మదరసా స్కూల్ ప్రిన్సిపాల్ అబ్దుల్ కలాం, సాధిక్, నాగూర్ జానీ, రజాక్, అజ్గర్ అలీ, ఇంతియాజ్, తదితరులు పాల్గొన్నారు.

భూముల రీసర్వేను వేగవంతం చేయాలి



భూముల రీసర్వేను పరిశీలిస్తున్న సర్వే డీటీ చిట్టమ్మ

సీతానగరం: భూముల రీసర్వేను వేగవంతం చేయాలని సర్వే డీటీ పి.చిట్టమ్మ సూచించారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో జరుగుతున్న సమగ్ర భూముల సర్వేను ఆదివారం పరిశీలించిన ఆమె రైతుల సమక్షంలోనే సర్వే జరగాలని, హద్దురాళ్లను వారు ఉన్నప్పుడే వేయాలని తెలిపారు. అంతకుముందు రెండు విడతల్లో జరిగిన సర్వేపై తహసీల్దార్ ఎన్వీ రమణతో సమీక్షించారు. ప్రస్తుతం మూడో విడతలో భాగంగా లక్ష్మీపురం, కృష్ణారాయపురం, రామవరం గ్రామాల్లో సర్వే జరుగుతోందని మండల సర్వేయర్ శంకరరావు పేర్కొన్నారు. సర్వే వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరిస్తూ సర్వే చేస్తున్నామని ఆయన అన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి

సాలూరు: చేనేత కార్మికులు అన్ని రంగాల్లో రాణించాలని చేనేత కార్మికుల సమాఖ్య జాతీయ సభ్యుడు కైలసాని సాయికుమార్ నేత కోరారు. స్థానిక పట్టణంలోని నాయుడు వీధిలో ఉన్న రామమందిరంలో సాలూరు కైకాల చేనేత యువగళం ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన కైకాల చేనేత ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఆయన చేనేత కార్మికుల సంక్షేమం ఉద్దేశించి, ప్రసంగించారు. దేశంలోని తొమ్మిది రాష్ట్రాల్లో చేనేత కార్మికులు అధికంగా ఉన్నారని, వారంతా ఐక్యమత్యంగా ఉండి విద్య, ఉద్యోగ, వ్యాపార, రాజకీయ రంగాల్లో రాణించి, అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం చేనేత కార్మికుల సమస్యలపై చర్చించి, అభివృద్ధి, సంక్షేమంపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో నాయకులు శివరాంప్రసాద్, శివప్రసాద్, కొడిపల్లి రాజ, వెంకటరమణ, ప్రభాకరరావు, అప్పారావు, మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇలా అయితే ఎలా..!



అధిక లోడ్‌తో గాంధీబొమ్మ సెంటర్ మీదుగా రాజాం వైపు వెళుతున్న మినీ వ్యాన్

రామభద్రపురం: మండల కేంద్రం మీదుగా లగేజీ వాహనదారులు అధిక లోడులతో రాకపోకలు సాగిస్తున్నారు. ముఖ్యంగా వరి పొట్టు, పాత సామాన్లు, ప్లాస్టిక్ డ్రమ్ములు, బిందెలు, ఖాళీ బ్రాందీ సీసాలు, తినుబండారాల ప్యాకెట్లు వంటి సరుకులతో ప్రయాణాలు సాగిస్తున్నారు. పరిమితికి మించి ప్రమాదకర రీతిలో రాకపోకలు సాగిస్తుండడం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మలుపుల వద్ద ఓవర్ లోడ్ వల్ల వాహనాలు బోల్తా పడే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఓవర్‌లోడ్‌తో రాకపోకలు సాగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చురుగ్గా వంతెన నిర్మాణ పనులు



నదిలో పిల్లర్ల ఏర్పాటుకు యంత్రాలతో గోతులు తవ్వుతున్న దృశ్యం

సంతకవిటి: మండలంలో వాల్తేరు గ్రామంలోని బలసలరేవు వద్ద నాగావళి నదిపై వంతెన నిర్మాణానికి సంబంధించి ప్రారంభ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఈనెల 19న వంతెన నిర్మాణ పనులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. పిల్లర్ల నిర్మాణానికి యంత్రాల సాయంతో నదిలో గోతులు తవ్వుతున్నారు. ఆర్అండ్‌బీ జేఈ ఆంజనేయల్‌నాయక్ పనులను పర్యవేక్షిస్తున్నారు.

అర్చకుడిని ఆదుకోండి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సిద్ధేశ్వర శ్రీశైలం

భామిని: ఆర్థిక కష్టాల్లో ఉన్న అర్చకుడి కుటుంబాన్ని ఆదుకోవాలని అతని స్నేహితులు కోరుతున్నారు. మండలంలోని పెద్దదిమిలి ఎండల మల్లికార్జున స్వామి ఆలయ అర్చకుడు సిద్ధేశ్వర శ్రీశైలం అనారోగ్యంలో బాధపడుతూ విశాఖపట్నంలోని మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఏడాది కిందట ఉపాధి కోసం హైదరాబాద్ వెళ్లి పనిచేస్తుండగా.. తీవ్ర అస్వస్థతకు గురికావడంతో మూసాపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. సంపాదించిన డబ్బంతా వైద్యానికి ఖర్చయిపోవడంతో సొంతూరు చేరుకున్నాడు. ఆరోగ్యం విషమించడంతో స్నేహితులు విశాఖపట్నం మెడికవర్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. నిరుపేద కుటుంబం కావడంతో వైద్యానికి డబ్బులు లేక భార్య జ్యోతి, ఇద్దరు పిల్లలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. దాతల సాయం కోసం అర్థిస్తున్నారు.

సాయం చేయదలచిన దాతలు ఫోన్‌పే నంబర్ **99897 75309**కు నగదు పంపించి ఆదుకోవాలని కోరుతున్నారు.

ముమ్మరంగా బోర్ల మరమ్మతులు



పెంకుటిల్లు కాలనీలో బోరు బాగుచేస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన క్రాష్ ప్రోగ్రాం ద్వారా గ్రామంలోని 8 బోర్లను మరమ్మతు చేపట్టి వినియోగంలోకి తీసుకొచ్చినట్లు సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు తెలిపారు. గ్రామంలోని కొండవీధి, నామాలగుడి, గడ్డికాలనీ, పాతబస్టాండ్, పెంకుటిల్లు కాలనీతో పాటు ఆర్‌సీఎం చర్చి ఆవరణంలోని బోర్లను ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది ఆదివారం బాగు చేశారు. మరమ్మతు పనులను సర్పంచ్ గౌరీశంకరరావు పర్యవేక్షించారు. వేసవిలో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడకుండా బోర్లు బాగు చేయించినట్లు చెప్పారు.

సంప్రదాయ విధానాలపై రైతుల ఆసక్తి



పొలంలో మందవేసిన గొర్రెలు

జియ్యమ్మవలస: రసాయన ఎరువుల వాడకం వల్ల ఎదురయ్యే సమస్యలపై వ్యవసాయాధికారులు తరచూ అవగాహన కల్పిస్తుండడంతో మండలంలోని రైతులు సేంద్రియ ఎరువుల వినియోగంపై ఆసక్తి చూపుతున్నారు. తక్కువ పెట్టుబడితో పాటు అధిక దిగుబడిని సాధిస్తున్నారు. దీనివల్ల గొర్రెలు, మేకల పెంపకందారులకు అదనపు ఆదాయం లభిస్తోంది. వేసవిలో పొలాల్లో రైతులు గొర్రెలు మందలను వేయిస్తున్నారు. అలాగే దమ్ముకు ముందు పేడతో కూడిన పచ్చిరొట్టవేసి పంటలు సాగుచేస్తారు. దీంతో భూమి సారవంతం అవ్వడంతో దీర్ఘకాలిక ప్రయోజనాలు ఉంటాయని రైతులంటున్నారు. మందల వల్ల మేకల పెంపకదారులకు అదనపు ఆదాయం లభిస్తోంది. ఎకరానికి వారం రోజులు పాటు మందను వేయిస్తే ఏడాదికి సరిపడా భూమికి కావల్సిన పోషకాలు లభించడంతోపాటు పంటలో రోగనిరోధక శక్తి పెరుగుతుందని రైతులు చెబుతున్నారు.

వేరుశనగ, అరటి, నువ్వులు, కాయగూరలు తదితర పంటలు సాగుతోపాటు వరి సాగు చేసే రైతులు గొర్రెల మందలు వేస్తుంటారు. దీంతో పాటు పశువుల గత్తం చెరువుల్లో ఉన్న మట్టిని కూడా పొలాల్లో వేస్తున్నారు. దీనివల్ల సారవంతంగా తయారవుతుందని రైతులు చెబుతున్నారు.

అవగాహనతో అగ్నిప్రమాదాల నివారణ



అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పాలకొండ రూరల్: అగ్ని ప్రమాదాలు సంభవిస్తే వాటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంచుకోవాలని ఆ శాఖ అధికారి జామి సర్వేశ్వరరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సీఎల్ నాయుడు అపార్ట్‌మెంట్స్ వద్ద ఆదివారం మాక్ డ్రిల్ నిర్వహించారు. ఇళ్లలో గ్యాస్ లీకై అగ్నిప్రమాదాలు సంభవించినపుడు వాటిని ఏవిధంగా అడ్డుకోవాలో ప్రయోగాత్మకంగా వివరించారు. గృహ, వ్యాపార సముదాల నిర్మాణ సమయంలో ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించాలని సూచించారు.

నిర్మానుష్యంగా ప్రధాన రోడ్లు



నిర్మానుష్యంగా మక్కువ-అజ్జాడ ప్రధాన రోడ్డు

సీతానగరం: కొన్నిరోజులుగా మండుతున్న ఎండలకు ప్రధాన రోడ్లు, వీధులు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. ఉదయం 10 గంటల నుంచే ఎండ విపరీతంగా కాస్తుండడంతో బయటకు వచ్చేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అత్యవసర పనుల నిమిత్తం బయటకు వెళ్లే వారు కూడా ఉదయం 11 గంటలయ్యేసరికి ఇళ్లకు చేరుకోవడంతో ఏ రోడ్లుపై కూడా వాహనాలు, పాదచారులు కనిపించే పరిస్థితి లేదు. సాయంత్రం 4 గంటల తర్వాతే జనం మళ్లీ రోడ్లుపై తిరుగాడుతున్నారు. వడదెబ్బ బారినపడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పనులు, ఉద్యోగాల కోసం వెళ్లేవారు గొడుగు, వాటర్‌బాటిల్ వెంట తీసుకువెళ్లాలని వైద్యులు సూచిస్తున్నారు.